# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రధమ కర్తవ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.
- ❖ భారీ వర్షాల నేపధ్యంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ తో పాటు మొత్తం 19 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.
- ❖ వర్షాల కారణంగా రాష్ట్రంలోని విద్యా సంస్థలకు రేపు సెలవును ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ❖ ఈ నెల 3వ తేదీ నుండి "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

============================

రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రధమ కర్తవ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తీవ్ర తుఫాను వల్ల ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని ఆయన తెలిపారు. వరద పరిస్థితుల నేపథ్యంలో విపత్తు నిర్వహణ కార్యాలయంలో అధికారులతో ఈ రోజు ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

============================

రాష్ట్రంలో రానున్న  24 గంటలలో ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ వాతావరణ  శాఖ రెడ్ అలర్ట్  జారీ చేసింది.  అదే విధంగా ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ని జారీ చేసింది. ఇదిలా ఉండగా, వాయుగుండం ప్రస్తుత పరిస్థితి గురించి అమరావతిలో భారత వాతావరణ కేంద్రం అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

===========================

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో విశాఖపట్నం - హైదరాబాద్ మధ్య నడిచే  గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళుతో పాటు మొత్తం 19 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అలాగే, భారీ వర్షాలకు పట్టాలపై వరదనీరు చేరడంతో మరో 15 రైళ్లను దారిమళ్లిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు  సికింద్రాబాద్ - భువనేశ్వర్ మధ్య సర్వీసులందించే విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు 2 గంటలు ఆలస్యంగా బయల్దేరనుందని అధికారులు తెలిపారు.  ఈ సాయంత్రం 4 గంటల 50 నిమిషాలకు సికింద్రాబాద్‌లో బయలుదేరాల్సిన ఈ రైలును సాయంత్రం 6 గంటల 50 నిమిషాలకు రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు. అదే  విధంగా హైదరాబాద్ - విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను ఈ రోజు, రేపూ దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసిందని అధికారులు తెలిపారు. రద్దయిన, దారిమళ్లించిన రైళ్ల వివరాలను దక్షిణ మధ్య రైల్వేశాఖ వెబ్ సైట్ లో పొందుపరిచామని పేర్కొన్నారు.

===========================

ఎడతెరిపిలేని విధంగా కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. దీంతో  వరద ఉధృతి కారణంగా రేపు రాష్ట్రంలోని విద్యా సంస్థలకు సెలవు  ప్రకటించాలని ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆదేశాలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

విరామం

===========================

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ నుండి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని అందించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులపైన అవగాహన కల్పించడంతో పాటు, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలసాయం అందుకునేలా రైతులకు తెలియచెప్పడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని మంత్రి అన్నారు.

===========================

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. అదేవిధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి పోస్టల్ ద్వారా సెప్టెంబరు 6వ తేదీలోగా పంపించాలని కోరారు.

============================

ప్రతీ సెంటు భూమికి సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అన్నారు. 2 వేల 200 ఎకరాలకు సాగునీరు అందించే శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం చిన్నసాన ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ఈరోజు పున: ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయాన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలకు పూర్వ వైభవం తెనున్నట్లు చెప్పారు. అదే విధంగా తొందరలోనే ఎత్తిపోతల పథకాలకు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహిస్తామని వెల్లడించారు.

============================

శబరి నదిలో వరద నీరు చేరి నీటి మట్టాలు పెరుగుతున్న నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని ముంపు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ముంపు మండలాలలోని అధికారులు అందరూ అందుబాటులో ఉంటూ.. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.

============================

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్న సామాన్య భక్తులకు కోరినన్ని లడ్డులు ఇస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలారావు స్పష్టం చేశారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... స్వామి వారిని దర్శనం చేసుకోకుండా లడ్డూలు తీసుకోవాలనుకునే వారికి రెండు లడ్డూలు ఆధార్ కార్డుపై ఇస్తున్నామని తెలిపారు. దళారీ వ్యవస్థను రూపుమాపడానికే పాత విధానాన్ని కొనసాగిస్తున్నామన్నారు. టీటీడీ లడ్డూల విక్రయంలో ఆంక్షలు పెట్టారన్నది పూర్తిగా అవాస్తవమని ఆయన పేర్కొన్నారు.

============================

భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద పోటెత్తడంతో అధికారులు విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 5 లక్షల 82 వేల 360 క్యూసెక్కులుగా ఉంది. 15.2 అడుగులకు నీటిమట్టం చేరింది. కాగా, నదీ పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

============================

============================